ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (సప్తమ శతకము – ప్రథమస్తబకము)

### పంచవింశ స్తబకము

**అవ**:- భరతఖండమున – ఆసేతు హిమాలయస్థితములగు పుణ్య క్షేత్రముల నధిష్టించి – విశ్రుతములగు దేవీమూర్తుల నీయిరువదయిదవ స్తబకమున ప్రస్తావించుచున్నాఁడు. అందు దక్షిణ దేశము నందలి దేవీ మూర్తులు – మొదట ప్రస్తావింపఁబడుచున్నవి. అందు మిక్కిలి నూతనమైన కన్యాకుమారీ నామమున ప్రసిద్ధమగు క్షేత్రమునందధివసించిన కన్యాకుమారిని స్తుతించుచున్నాఁడు.

మూ॥ కన్యాకుమారీ నితరాం వదాన్యా
మాన్యా సమస్తైః ప్రకృతేరనన్యా
ఆక్షేపకం సాగర బుద్బుదానాం
హాసం విధత్తాం జగతఃసుఖాయ॥ 1

అత్యధికమగు దానకుశలత గలదియు, నరుల చేతను సురల చేతనుగూడ పూజింపఁదగినదియు, ప్రకృతికంటె వేరుకానిదియు, అగు కన్యాకుమారి - (బాలయగు దేవి) సాగరబుద్బుదముల నాక్షేపించునదియగు హాసమును – లోకము యొక్క సుఖము కొఱకు ప్రసరించుఁగాత!

**ప్రభ**:– 'అనవరతోత్తరంగ ధవల ఫేన బుద్బుదా క్షేపకమగు హాసము' అని చెప్పుట వలన అభినవ నిత్యోదయ శుభ్రశోభాతిశాయియగు కుమారీహాసము జగన్మాంగలికమని స్తుతింపఁబడుచున్నది.



**అవ**:- రామేశ్వర క్షేత్రము– సేతుబంధమని ప్రసిద్ధము. ఇచ్చట ప్రసన్నయగు పర్వత వర్ధనీ దేవిని స్తుతించుచున్నాఁడు.

మూ॥ రక్షస్వచేతో మదమత్సరాదే
ర్భిక్షస్వకాలే తనురక్షణాయ
వీక్షస్వరామేశ వధూపదాబ్జం
మోక్ష స్వలాభే యది తేఽభిలాషః॥ 2

ఓ ముముక్షువూ! మోక్షమను ధనము నందు నీకభిలాషముండిన యెడల మదమత్సరాదులనుండి నీమనస్సును రక్షించుకొనుము. **శరీర రక్షణము కొఱకు ఉచితమగు కాలమునభిక్షను గైకొనుము.** రామేశ వధువగు పర్వతవర్ధనీ దేవి యొక్క పదాబ్జమును వీక్షింపుము.

**ప్రభ**:– మనస్సు నుండి మదమాత్సర్యాదులను తొలఁగించుట, శరీర ధారణము కొఱకు భిక్షఁ గొనుట, పర్వతవర్ధనీ దేవీ పాదములను దర్శించుట, అను నీ మూఁడింటిని ముఖ్య కర్తవ్యములుగా స్వీకరించువానికి ఆత్మాభిలాషము సిద్ధించునని భావము.

**అవ**:- మధురాక్షేత్రమున కధి దేవతయు, సుందరేశ్వరసనాథయు అగు, మీనాక్షీ దేవిని స్తుతించుచున్నాఁడు.

మూ॥ లోక స్వదూరీకృత భక్త శోకం
హాలాస్యనా థేక్షణపుణ్యపాకమ్
భీతిః సఖేచేద్ భవతః పవిత్రమ్
జ్యోతిర్వి శేషం జలచారి నేత్రమ్॥ 3

సఖా! నీకు జననము వలని భయము కలుగు నెడల, భక్త లోకము యొక్క శోకమును తొలఁగించునదియు, హాలాస్య క్షేత్రనాథుఁడగు (మధురాక్షేత్ర

నాథుఁడగు) సుందరేశ్వరుని దృష్టి యొక్క పుణ్యమునకు ఫలభూతమగునదియు, మీనముల వంటి నేత్రములు గలది. మీన నేత్రము (పోషణము) వంటి నేత్రము (పోషణము) గలది. పవిత్రమయినదియు, నగు జ్యోతిర్విశేషమును, వీక్షింపుము.

ప్రభ:- మధురా క్షేత్రమునకు సుందరేశ్వరుఁడు నాయకుఁడై యున్నాఁడు. అసుందరేశ్వరుని నాయిక మీనాక్షి. '' ఆమె భక్తుల శోకమును తొలంగించును. మీనమువలె దృష్టిమాత్రము చేతనే భక్తులగు ప్రజలను పోషించుట చేతను గాని, మీనములవంటి నేత్రములు గలదగుట చేతనుగాని, ఆమె మీనాక్షియగుచున్నది. ఆమె జ్యోతిస్స్వరూపిణి. భక్తుల పాపములను తొలఁగించును'' అని తాత్పర్యము.

**అవ**:- జంబుకేశ్వర క్షేత్రమూర్తియగు అఖిలాండనాయికను స్తుతించు చున్నాడు.

మూ॥ యో లోకతే తామఖిలాణ్డరాజ్ఞీ
మజ్ఞాన విధ్వంస విధాన విజ్ఞామ్।
అమ్బాం పరాం జీవన లిఙ్గశక్తిం
భూయః సకాయం నభవేల భేత॥ 4

సర్వానర్థ హేతువగు అజ్ఞానమును ధ్వంసము చేయు విధానము నెఱుఁగునదియు, జీవన లింగమగు ( జలమునందున్న లింగమగు) జంబు కేశ్వరుని శక్తియు, పరాంబయు, అగు అఖిల బ్రహ్మాండనాయికను దర్శించిన మనుష్యుఁడు- పునర్జన్మము నొందఁడు.

ప్రభ:- దక్షిణ దేశమున ప్రసిద్ధములగు పంచభూత క్షేత్రములలో జంబు కేశ్వర క్షేత్రమును – అప్యమని ( జల సంబంధి యని ) చెప్పుదురు.



మూ॥ బిభ్రత్ సహస్రంచ ముఖానిశక్తో
వక్తుం గుణాన్ కః కమలాలయశ్య।
జన్మాఽపి యత్రప్రభవే జ్జనానాం
ముక్త్యై మునీనామపి దుర్లభాయై॥ 5

చోళమండలమునందున్నదియు, 'తిరువారూర్' అను ద్రవిడ నామమున ప్రసిద్ధమగునదియు, త్యాగరాజసనాథయగు త్రిపుర సుందరీ దేవిచేత అధిష్ఠింపఁబడినదియు, నగు కమలాలయ క్షేత్రము యొక్క గుణములను వర్ణించుటకు సహస్రముఖములను వహించువాఁడయినను గూడ నెవ్వఁడును శక్తుఁడు కానేరఁడు. ఆ క్షేత్రమున జన్మించుట కూడ- ధ్యాన నిష్ఠులగు మునులకుఁగూడ దుర్లభమగు ముక్తి నొసఁగుటకు సమర్థమగుచున్నది.

ప్రభ:- తిరవారూరునందు జననముగూడ – మోక్షప్రదమని భావము.

మూ॥ వ్యాఘ్రాఙ్ఘ్రివాతాశన పూజితస్య
నాట్యస్థలీనాయికయా శివస్య
నేత్రాధ్వభాజా శివకామయా వో
మిత్రాణికామాః ఫలినోభవన్తు॥ 6

ఓ మిత్రులారా! వ్యాఘ్రపాదుని చేతను, శేషావతారుఁడగు పతంజలి చేతను, పూజింపబడిన, చిదంబర నటరాజస్వామి యొక్క నాట్యస్థలీనాయికయు, మీ దృష్టిపథము నొందినదియు, అగు శివ కామేశ్వరీ దేవి చేత – మీమనోరథములు ఫలించుఁగాత!

ప్రభ:-– చిదంబర క్షేత్రనాథుఁడగు నటరాజస్వామి యొక్క ప్రియురాలగు శివకామేశ్వరి యొక్క సందర్శనము చేత – అభీష్టార్థ సిద్ధి కలుగుఁగాతమని తాత్పర్యము. పంచభూత క్షేత్రముల యందీ చిదంబర క్షేత్రము – ఆకాశక్షేత్రమని ప్రసిద్ధమగుచున్నది.

మూ॥ ఆ లోకతేఽ పీతకుచామయిత్వా
మాలోలచిత్తా మరుణాచలేయః
నిర్వేదవాన్ పర్వసుధాంసువక్త్రే
సర్వేవ శేతస్య భవన్తికామాః॥ 7

పూర్ణచంద్రవదనవగు జననీ! తైజసలింగమగు అరుణాచలమున (అరుణాచలేశ్వరుని యందు) అనురాగ విలసితమగు చిత్తముగల దానవును, 'అపీతకుచ' అను పేరుగలదానవును అగు నిన్ను– విలోకించిన నిర్వేదవంతుఁడగు మనుష్యునకు కోరికలన్నియును వశపడును.

ప్రభ:– అరుణాచల సనాథయగు ఆ పీతకు చాంబికను దర్శించుట వలన విషయముల యందు ద్వేషము గల చిత్తవృత్తిగల మనుజునకు కామములన్నియు స్వాధీనములగునని భావము. **గణపతిమునికీ క్షేత్రమునందే స్వగురు (రమణమహర్షి) లాభమును, చిరకాలవాసమును లభించి దివ్యములగు సిద్ధులు గలిగెనని గ్రహించునది.**

మూ॥ యః కుణ్డలీపట్టణ రాజధానీ
మాలోకతే కామపి కృత్తమస్తామ్।
నిస్సారమానన్దక థావిహీనం
సంసార మేతం స జహాతి బుద్ధ్యా॥ 8

కుండలీపట్టణము (పడైవీడు) రాజధానిగాఁ గలదియు, ఛేదింపబడిన శిరస్సు గలదియు, చెప్పుటకు శక్యము కానిదియు, అగు రేణుకాఁ దేవిని – వీక్షించిన భక్తుఁడు సారము లేనిదియు, ఆనందమను మాటకూడ లేనిదియు, అగు జనన మరణరూపమగు ఈ సంసారమును బుద్ధిచేత విడిచి విరక్తుఁడగును.



ప్రభ:– ద్రవిడ భాషచేత 'పడైవీడు' అని చెప్పఁబడిన కుండలీపురము – ప్రసిద్ధమగు రేణుకా క్షేత్రమగుచున్నది. గణపతి మునీంద్రుఁడు తపము నొనర్చిన స్థలములయందిది యొక ముఖ్య క్షేత్రమని తెలియునది.

మూ॥ దృష్ట్వావధూ మాది పురీశ్వరస్య
యో లోచనారోచక మాధునోతి।
తస్యాన్తరఙ్గం ధుత సర్వసఙ్గం
భూయోఽథ వారోచకమావృణోతి॥ 9

ఆదిపురీ (తిరువొత్తి యూర్) క్షేత్రేశ్వరుని వధువగు త్రిపుర సుందరీదేవిని దర్శించి దర్శించి – దర్శనీయమగు నీ తల్లిస్వరూపమును మరల వీక్షింతునని, దృశ్యవస్తువునందలి జుగుప్సను నేత్రయుగళము నుండి తొలఁగించి సఫలనేత్రుఁడగు వాని యంతఃకరణము – సంగరహితమయి, పునర్జన్మము నందలి జుగుప్సను ఆచ్ఛాదించును.

ప్రభ:- త్రిపుర సుందరిని జూచిన వానికి నిజాంతరంగము – నిస్సంగమగును. కావున పునర్జన్మమునందాయమ్మ దర్శనము మరల లభించును. కావున వానకి పునర్జన్మము నందు జుగుప్స కలుగదని భావము.

మూ॥ కాఞ్చీరమణ్యాః కురుతాం గృహస్థే
క్వాణైర్ముదం కామపికిఙ్కిణీనామ్
కాఞ్చీభువః పుణ్యపురీ యతీన్ద్ర
త్వా మమ్బికానామరవైర్ధినోతు॥ 10

గృహస్థునకు – తన ప్రియురాలి కాంచి – (మొలనూలు) – కింకిణీ క్వాణముల చేత అనిర్వాచ్యమగు ప్రీతిని కలిగించుఁగాక. ఓ యతీంద్రా! భూదేవికి కాంచియగు కాంచి (కాంచియను పుణ్యనగరి) కామాక్షీనామ ధ్వనుల చేత నిన్ను సంతోషింపఁజేయును గాత!

ప్రభ:- దక్షిణ దేశమున కాంచీ క్షేత్రమున్నది. తదధీశ్వరి - కామాక్షి. పంచభూత క్షేత్రములయందిది పృథివీ క్షేత్రమని చెప్పుదురు.

అవ:- ఇట్లు దక్షిణ దేశ స్థలముల నభిస్తుతించి ఆంధ్రదేశస్థలమగు శ్రీ కాళహస్తి క్షేత్రమును గానము చేయుచున్నాడు.

మూ॥ శ్రీ కాలహస్తిస్థల దర్శనస్య
కైలాస వీక్షాం పునరుక్తిమాహుః।
జ్ఞానం ప్రదాతుం చరణాశ్రితేభ్యో
జ్ఞానామ్బి కాయత్రని బద్ధదీక్షా॥ 11

క్షేత్ర మహాత్మ్యము నెఱిఁగిన పెద్దలు - కైలాస దర్శనము కంటె శ్రీ కాళహస్తి క్షేత్రదర్శనము వేరు కాదని చెప్పుదురు. అచ్చట నిజ చరణశరణులగు పుణ్య పురుషులకు జ్ఞానము నొసంఁగుటకు జ్ఞానాంబిక దీక్ష వహించుచుండును.

ప్రభ:- శ్రీ కాళహస్తి క్షేత్ర దర్శనమనినను, కైలాస దర్శనమనినను, ఒక్కటియే. ఆ క్షేత్రమున కధీశ్వరియగు జ్ఞానాంబిక - భక్తులకు మోక్షము నిచ్చుటకు ధృతవ్రతయై యున్నది. ఈ క్షేత్రము - వాయు క్షేత్రమని విశ్రుతమగుచున్నది.

మూ॥ శ్రీశైలశృఙ్గస్య విలోకనేన
సజ్జేనహీనో భవతామనుష్యః
ధామాస్తియత్ర భ్రమరాలకాయాః
శాన్తభ్రమం తద్ భ్రమరామ్బికాయాః॥ 12

దత్త మండలమను పేరుగల ఆంధ్ర దేశభాగమున ప్రసిద్ధమగు శ్రీశైల శిఖరమును సందర్శించిన మనుష్యుఁడు - నిస్సంగుఁడగును. అది - భ్రమరాలకయగు భ్రమరాంబిక నివసించు భ్రాంతి వివర్జితమగు స్థానమగుచున్నది.



ప్రభ:- శ్రీశైల క్షేత్రాధీశ్వరి - భ్రమరాంబిక

అవ:- పశ్చిమ సముద్రతీరమునందలి యుత్తర కేరళ భాగమునందున్న గోకర్ణ క్షేత్రమున విరాజమానయగు భద్రకర్ణీ దేవియొక్క మహిమను ప్రశంసించుచున్నాడు.

మూ॥ తీరే విపశ్చిద్ వరపశ్చిమాబ్దే
ర్గోకర్ణగాం లోకయభద్రకర్ణీమ్।
బుద్ధిం శివాం సర్వమనోరథానాం
సిద్ధించ యద్యస్తి మనోఽధిగన్తుమ్॥ 13

ఓ విద్వదగ్రణీ! కల్యాణమయియగు బుద్ధిని - సర్వమనోరథ సిద్ధిని- గూడ పొందుటకు నీకు మనస్సు కలిగినయెడల పశ్చిమ సముద్రతీరమునందలి గోకర్ణ క్షేత్రమున నివసించిన భద్రకర్ణీనామమున ప్రసిద్ధయగు కాలిని - వీక్షింపుము.

అవ:- మహారాష్ట్ర దేశగతమగు కరవీర క్షేత్రమును ప్రశంసించుచున్నాఁడు.

మూ॥ ధామ్ని ప్రసిద్ధే కరవీరనామ్ని
పుణ్యాభిధానాం కృత సన్నిధానామ్।
దేవీం పరాంపశ్యతి యో విరక్తో
ముక్తేః స పాణిగ్రహణాయశక్తః॥ 14

'కరవీర' నామమున ప్రసిద్ధమగు క్షేత్రమున సాన్నిధ్యము ననుగ్రహించిన, పుణ్యాభిధాన (పవిత్రమగు నామము గలది లేక 'పుణ్య' అను పేరు గలది) అగు పరాదేవిని - విరక్తుఁడగు నెవ్వఁడు - చూచునో, అతఁడు- ముక్తి (కాంతా) పాణి గ్రహణమునకు యోగ్యుఁడగును.

మూ॥ జ్ఞానేదృఢాతే యదికాఽఽ పికాఙ్క్షా
నాఽఽసేహసం మిత్ర! ముధాక్షిపేమమ్।
సేవస్వదేవీం తులజాపురస్థాం
నైవస్వరూపాదితరాకి లేయమ్॥ 15

మిత్రమా! నీకు జ్ఞానమునందు దృఢమగు వాంఛయున్న యెడల గడచుచున్న యీకాలమును వ్యర్థము నొనర్పకుము. తులజాపురమునందున్న దేవిని సేవింపుము. ఈయమ్మ – ఆత్మస్వరూపము కంటె వేరుకాదట!

**ప్రభ:**- సర్వమగు నాత్మకంటె నితరముగాక విరాజిల్లుచున్న తులజాపురస్థయగు దేవిని భజింపుమని యర్థము.

**అవ:**- ఉత్కల దేశమునందున్న రెండు స్థలములను స్తుతించుచున్నాఁడు.

మూ॥ గోపాలినీ వేషభృతం భజస్వ
లీలాసఖీంతాం భువనేశ్వరస్య
ఇష్టం హృదిస్థం తవహస్తగంస్యాత్
కష్టంచ సంసారభవం నభూయః॥ 16

గోపాలినీ వేషమును ధరించునదియు, ( ఉత్కల దేశమున ప్రసిద్ధుడగు) భువనేశ్వరునకు లీలాసఖియు, నగు ఆ దేవిని భజింపుము. నీహృదయమునందున్న యభీష్టము – హస్తగతమగును. (ఫలించును) జనన మరణ భ్రమరూపమగు సంసారము నుండి, యుద్భవించునదియగు కష్టము – నీకు మరల కలుగదు.

**ప్రభ:**-గోవులను కాచు తరుణివంటి రూపమును ధరించి, గోపాలినీ నామమున ప్రసిద్ధురాలగు పరమేశ్వరి – భువనేశ్వర క్షేత్రాధీశ్వరియని తెలియునది.



మూ॥ ఆరాధ్యతే వైతరణీ తటస్థా
యేనేయ మమ్బా విరజోఽఽ భిధానా
ఆరాధితం తేన సమస్తమన్యత్
సారోధరాయా మయమార్య గీతః॥ 17

వైతరణీ నదీ తీరమునందధివసించిన విరజోఽఽభిధానయగు ( విగతమగు రజస్సుగలదియను పేరుగల) ఈవిరజో దేవిని – ఎవఁడారాధించునో వాఁడు – తదితరమగు సర్వమును గూడ నారాధించిన వాఁడగును. విరజోదేవి భజనమే భూమియందు సారమని యార్యుల చేత గానము చేయఁబడినది.

**ప్రభ:**- విజ్ఞులు – విరజోదేవీ భజనమే సర్వసారమనియు, తదితరమంతయు నిస్సారమని, చెప్పుదురనియు, విరజోదేవి – సర్వస్వరూపిణి కావున నామె నారాధించుట సర్వమును ఆరాధించుటయే, యగుననియు భావము నెఱుఁగునది.

**అవ:**- వంగ దేశమునందలి క్షేత్రమును ప్రస్తావించుచున్నాఁడు.

మూ॥ సఙ్గీయమానం స్థలమార్యబృన్దై
ర్బృన్దారకాణాం సరిత స్తటేఽఽస్తి।
యః కాలికాం పశ్యతి కాల కేశీం
తత్రాస్య కాలాదపినై వభీతిః॥ 18

ఆర్య సంఘముల చేత సంకీర్తింబడుచున్న క్షేత్రము – దేవనదీ ( గంగా) తీరమునందున్నది. ఆ స్థలమునందున్న కాలకేశియగు (నల్లని జుట్టుగల) కాళిని సందర్శించిన భాగ్యశాలికి – కాలుని ( మృత్యువు) వలనఁగూడ భీతి కలుగదు.

**ప్రభ:**- మృత్యువు వలనఁగూడ భీతి కలుగని వానికి తదితరము వలన భీతి కలుగనేరదు. కావున కాళీదర్శనవంతుడు – అకుతో భయుఁడగునని భావము.

**అవ:-** కామరూప దేశమునందున్న కామరూప క్షేత్రమును కీర్తించుచున్నాఁడు.

మూ॥ నీలాచలం సిద్ధసమూహసేవ్యం
లీలానికేతం ప్రవదన్తి యస్యాః।
భద్రా పరాకాచన గుహ్యాముద్రా
కామేశ్వరీ సాభువనస్యమూలమ్॥ 19

సిద్ధగణ సేవ్యమగు నీలా చలక్షేత్రమును - దేవికి - లీలా భవనమని పండితులు చెప్పుదురు. ఒకానొక రహస్య రూపగుహ్యాముద్ర యగు భద్రయు, పరయు, అగు ఆ కామేశ్వరి - ప్రపంచమునకు మూలమగుచున్నది.

**ప్రభ:-** సర్వజగత్తునకును 'దేవియే జన్మస్థల' మని గుర్తింపఁజేయుటకు తాంత్రికులు - ఆమెను గుహ్యాముద్ర (యోనిముద్ర) అని చెప్పుదురని భావము.

**అవ:-** మగధ దేశమునందలి క్షేత్రమును కీర్తించుచున్నాడు.

మూ॥ మాంగల్యగౌరీ పదదర్శ నస్య
కర్తాతు భూత్వా సుకృతస్యభర్తా।
ఆచారపూతై రధిగమ్యమగ్ర్యం
స్థానం ప్రపద్యేత యతోనపాతః॥ 20

మాంగల్యగౌరీ (మంగళమయియగు గౌరీదేవి) పాదదర్శన కర్త - సుకృత భర్తయై, సదాచార పవిత్రులగు పురుషుల చేత అధిగమ్యమగు శ్రేష్ఠస్థానము నొందును. ఆ స్థానము నుండి పతనము కలుగదు.

**ప్రభ:-** మంగల గౌరీ పద దర్శనకర్త - సదాచారపూతులగు పురుషులచే బొందఁదగినదియు, పునఃపతనము లేనిదియునగు పరమపదము నొందునని భావము.



**అవ:-** ఉత్తర దేశమునందున్న స్థలద్వయమును ప్రస్తావించుచున్నాఁడు.

మూ॥ వారాణసీ శుభ్రగిరే రనూనం
క్షేత్రం పవిత్రం భువనత్రయేఽపి।
అర్థే ప్రజానాం విధృతాన్నపాత్రా
గౌరీస్వయం యత్రవిశాలనేత్రా॥ 21

వారాణసీ క్షేత్రము - త్రైలోక్యమునందును గూడ - పవిత్రము. శుభ్రగిరియగు కైలాసము కంటె నది తక్కువదిగాదు. ఆ పవిత్ర క్షేత్రమునందు విశాలనేత్ర (విశాలాక్షి) యగు గౌరీదేవి - ప్రజలను పోషించుటకు స్వయముగా, అన్నముతో నిండిన పాత్రను ధరించి - అన్నపూర్ణయై విరాజిల్లుచున్నది.

మూ॥ బృన్దారకారాధిత పాదపద్మాం
నన్దామిమా మిన్దుసమానవక్త్రామ్।
అలోక్యవిన్ధ్యాచలవాసినీం నా
నాలోచయేత్ సంసృతితో భయాని॥ 22

బృందారకుల చేత - ఆరాధింపఁబడు పాదపద్మముల గలదియు, ఇందు సుందరముఖియు, వింధ్యపర్వత వాసినియు, భగవతియు, అగు ఈనందా దేవిని - సందర్శించిన నరుఁడు - సంసారమువలని భయము నెఱుఁగడు.

**ప్రభ:-** వింధ్య పర్వతము నందున్న నందాఖ్యయగు మూర్తి నీక్షించుట వలన సంసారభీతి - తొలఁగునని భావము.

**అవ:-** మాలవ దేశమునందున్న అవంతీపురీశ్వరిని స్తుతించుచున్నాఁడు.

మూ॥ ఆనన్ద దేహా మిహముక్తి సంజ్ఞాం
నారీం పరీరబ్ధు మనా మనుష్యః
దూతీం వృణోతు ప్రమథేశ్వరస్య
కాన్తా మవన్తీ పురనాయికాంతామ్॥ 23

ఆనందమేయగు దేహము గల 'ముక్తి' అను సంకేతము గల నారిని, ఈలోకమునందే పరీరంభించుటకు మనస్సు గల నరుఁడు ప్రమథగణేశ్వరుఁడగు శివుని కాంతయగు, ఆయవంతీపురీశ్వరిని దూతినిగాఁ గోరునుగాత!

**ప్రభ:**- ముక్తినారిని కామించిన పురుషునకు - ఆమెతోడి కలయికను గూర్చుటకు భగవతియగు అవంతీ పురీశ్వరి దౌత్యకర్మమును నెరపునని తాత్పర్యము. మోక్షముఁగోరిన వాని కీయవంతీపురీశ్వరి - మోక్షమునే యొసగునని భావము.

**అవ:**- కైలాసమును స్తుతించుచున్నాఁడు.

మూ॥ యత్రాచల చ్ఛిద్ర కృతా సహాసం
భ్రాత్రాముహుః ఖేలిత వాన్ వనేషు।
తం సిద్ధ దేవర్షినుతం స్మరామి
కైలాసమావాసగిరిం జనన్యాః 24

ఏ కైలాసమునందలి వనములయందు, పర్వతమునకు రంధ్రము నొనర్చిన (సోదరుఁడగు) సుబ్రహ్మణ్యునితోఁగూడి **గణపతినగు నేను** నిత్యమును ఆడుకొంటినో, సిద్ధులచేతను, దేవతల చేతను, ఋషులచేతను స్తుతింపఁబడుచున్నదియు, తల్లియగు పార్వతి - నివసించునదియు, అగు ఆ కైలాసపర్వతమును ధ్యానించుచుందును.

**అవ:**- స్తబకము నుపసంహరించుచున్నాఁడు.



మూ॥ పూర్ణామ్బరే శీతకరేఽధికారం
బిభ్రత్యగేన్ద్రే ధవలే సలీలా।
క్షేత్రేషు కాశ్యాదిషు గుప్తశక్తి
ర్గౌరీన్ద్ర వజ్రాసుచ సన్నిధత్తామ్. 25

తెల్లనిదగు హిమాచలేంద్రమునందు లీలతోఁగూడినదై, పూర్ణమగు ఆకాశముగల శీతకరునియందు (చంద్రునియందు) స్వీయమగు నధికారమును ధరించుచు, ( ఆచంద్రునికంటెను గూడ అధికమగు శోభగలదై) కాశ్యాది క్షేత్రములయందు గుప్తమగు శక్తిగలదగు గౌరీదేవి - ఇంద్రవజ్రావృత్త నిబద్ధములగు ఈ స్తుతులయందుఁగూడ - (కాశ్యాదుల యందువలెనే) సాన్నిధ్యము నొసఁగుగాత!

**ప్రభ:**- ఈ స్తుతులు - దృష్టఫలకములును, వీర్యవంతములును, అగుఁగాత!

ఇది సవ్యాఖ్యమగు పంచ వింశ స్తబకము

****